సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 6 । ఏప్రిల్ । 2024



ఘనంగా క్షీరాభిషేక సేవ

విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం ఉదయం క్షీరాభిషేక సేవను ఘనంగా నిర్వహించారు.



కల్యాణం.. కమనీయం

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

రంజాన్ వేళలు

పాడేరు, అరకు

ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
6.15	4.32

రంపచోడవరం

ఇఫ్తార్	సహర్
6.28	4.37

న్యూస్‌రీల్

పాడేరు @ 34 డిగ్రీలు

- నిప్పులు చెరిగిన భానుడు
- గరిష్ట ఉష్ణోగ్రత నమోదు



జనసంచారం తక్కువగా ఉన్న పాడేరులోని పాతబస్టాండ్ ప్రాంతం

సాక్షి,పాడేరు: చల్లని వాతావరణానికి పేరొందిన మన్యంలో గత కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వేసవి ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. అధిక ఎండతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా భానుడు నిప్పులు చెరగడంతో ప్రజలు అల్లాడిపోయారు. పాడేరులో శుక్రవారం 34డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రధాన సెంటర్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. నిత్యం రద్దీగా ఉండే జిల్లాకేంద్రం పాడేరులోని అంబేడ్కర్ సెంటర్ జనసంచారం లేక వెలవెలబోయింది.

10న క్యాన్సర్ వైద్య శిబిరం

చింతూరు: రౌండ్ టేబుల్ ఇండియా, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధిపై ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈశిబిరంలో జీఎస్ఎల్ ఆస్పత్రికి చెందిన క్యాన్సర్ వైద్యనిపుణులు వచ్చి రోగులను పరీక్షించి అవసరమైన వారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తారని తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చేవారు తమ మెడికల్ రిపోర్టులు, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులను తీసుకురావాలని ఆయన సూచించారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ



వంజరి-2 సచివాలయంలో పింఛను పంపిణీని పరిశీలిస్తున్న పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

జి.మాడుగుల: మండలంలో గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తనిఖీ చేశారు. దీనిలో భాగంగా జి.మాడుగుల-2, వంజరి-2(దేవరాపల్లి), కె.కోడాపల్లి గ్రామ సచివాలయాలను ఆమె సందర్శించారు. ఇప్పటివరకు 93 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ ఆమెకు వివరించారు. పింఛనుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో అందజేయాలని ఆమె ఆదేశించారు.

నాలుగు రోజులు అవస్థలు



పెదబయలు మండలం బోయిపల్లి గ్రామానికి చెందిన నా పేరు బోయిభ అమ్మి. జగన్ ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛను ఇచ్చారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాల వల్ల ఈ నెల పింఛను పొందేందుకు ఇబ్బందులు పడ్డాం. సేవ చేసే వలంటీర్లను ఇబ్బంది పెట్టడం ఆయనకు తగదు. ఈ నెల వారు లేకపోవడం వల్ల పింఛను కోసం నాలుగు రోజులు ఇబ్బందులు పడ్డాం. కరోనా సమయంలో ఎవరూ రాలేని పరిస్థితుల్లో వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛను ఇచ్చారు. **వాళ్ల సేవలను మరువలేం. మళ్లీ జగన్ బాబును సీఎం చేస్తాం.**

వలంటీర్ లేక ఇబ్బంది పడ్డాం



పెదబయలు మండలం గోమంగి గ్రామసచివాలయం పరిధి వన్నాడ గ్రామానికి చెందిన నా పేరు గల్లేలి పెద్దమ్మి. వలంటీర్లు ఈ నెల రాకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడ్డాం. పింఛను కోసం సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలోని గోమంగి గ్రామసచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది. వలంటీర్లు ఒకటో తేదీ ఉదయాన్నే పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన పనికి మాలాంటి వాళ్లకు పింఛను కష్టాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో చంద్రబాబు చాలా తక్కువ **మొత్తంలో పింఛను ఇచ్చేవారని, ఇప్పుడు జగన్ బాబు రూ.3వేలు ఇస్తున్నారు.**

'తొలి సంతకం' హర్షణీయం



నాపేరు సోడె చిరంజీవి. నేను వీఆర్‌పురం మండలంలో చొక్కనపల్లి వలంటీర్‌గా పనిచేసేవాడిని. పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్నకు ఈ ఎన్నికల్లో అండగా నిలవాలని వలంటీర్ పోస్టుకు రాజీనామా చేశా. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ల నియామకంపై తొలి సంతకం చేస్తానని చెప్పడం జగనన్న చెప్పడం హర్షణీయం. మేమంతా ఆయనకు రుణపడి ఉంటా. వచ్చే జీతం తక్కువైనా గౌరవానికి ఏమాత్రం లోటు లేకుండా జీవనం సాగించేవాళ్లం. ఈ ఎన్నికల్లో **మా రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి** నాగులపల్లి ధనలక్ష్మికి మద్ద**తుగా ప్రచారం చేస్తా.**

పండుటాకులకు దిగులు లేకుండా..

- సత్వరం పింఛన్లు పంపిణీ చేసిన గ్రామ సచివాలయ సిబ్బంది
- వలంటీర్ల సేవలు ఆగవని సీఎం జగన్ స్పష్టీకరణతో పింఛనుదారుల్లో ఆనందం
- ఆయన 'తొలి సంతకం' ప్రకటనపై సర్వత్రా హర్షం
- అవ్వా తాతలు, దివ్యాంగులకు ఊరట
- మళ్లీ ఇంటికే పింఛన్లు అందుతాయంటూ సంబరం



మాలయ్యపాకల గ్రామంలో ఇంటి వద్దకు వెళ్లి పింఛను ఇస్తున్న గ్రామసచివాలయ ఉద్యోగి



పింఛను అందుకున్న ఆనందంలో వృద్ధుడు

సాక్షి, విశాఖపట్నం : గత 58 నెలల నుంచి వలంటీర్లే వచ్చి ఇళ్ల వద్దనే పెన్షన్లు ఇచ్చారు.. ఒకటో తేదీ సూర్యోదయానికి ముందే పెన్షను సొమ్ము వారి చేతిలో పెట్టేవారు.. ఏమాత్రం కష్టం లేకుండా రూ.3 వేలు అందుకుంటున్న అవ్వా, తాతలు, దివ్యాంగుల కళ్లలో ఆనందానికి అవధులు ఉండేవి కావు.. ఈ వ్యవస్థ సాఫీగా కొనసాగుతుండగా చంద్రబాబు కుటిల రాజకీయం వీరి పాలిట శాపంగా మారింది. వీరికి వలంటీర్లు పెన్షను సొమ్ము ఇవ్వకుండా అడ్డుపడ్డారు. వలంటీర్ల వ్యవస్థకు తాత్కాలికంగా బ్రేకులు వేశారు. వడగాడ్పులు వీస్తున్న ప్రస్తుత తరుణంలో అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు మరొకరిని వెంటబెట్టుకుని వెళ్లి పింఛను తీసుకోవలసిన పరిస్థితి దాపురించింది. ఆటోలకు రానుపోను చమురు వదిలించుకోవలసి వస్తోంది. దీనికంతటికీ కారణం చంద్రబాబు అండ్ కో అని తెలుసుకున్న పండుటాకులు, దివ్యాంగులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రజల సంక్షేమం కోరుకునే వారే నిజమైన పాలకులు, ప్రజా సేవకులు అవుతారు తప్ప ఇలా తిప్పలు పెట్టేవారు కాదంటూ నిప్పులు చెరుగుతున్నారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన వీరికి ఎంతో ఊరటనిచ్చింది. వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని, వారి సేవలు ఆగవని, యథావిధిగా వాళ్లే ఇంటింటికి పెన్షను తెచ్చి ఇస్తారని, మళ్లీ అధికారంలోకి వచ్చాక తన తొలి సంతకం ఆ ఫైల్ పైనేనని తిరుపతి జిల్లా నాయుడుపేట బహిరంగ సభలో స్పష్టం చేశారు. దీంతో జగన్ మళ్లీ సీఎం అయ్యాక ఎప్పటిలాగానే వలంటీర్లు ఇంటికే వచ్చి పెన్షను ఇస్తారని అవ్వా తాతలు, దివ్యాంగులు ఎంతో మురిసిపోతున్నారు. ఈ విషయాన్ని వీరు సాటి వారికి చెప్పుకుని తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. మరోవైపు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని సీఎం చేసిన ప్రకటనపై వలంటీర్లలోనూ ఆనందం వ్యక్తమవుతోంది.

శరవేగంగా పింఛన్ల పంపిణీ

వృద్ధులు, దివ్యాంగుల కష్టాలను ముందుగానే గుర్తించిన ప్రభుత్వం సత్వరమే పెన్షన్ పంపిణీకి చర్యలు చేపట్టింది. పెన్షన్ కోసం వచ్చే వారికి ఆలస్యం చేయకుండా వెనువెంటనే సొమ్ము అందజేయాలని సంబంధిత సచివాలయాల సిబ్బందిని ఆదేశించింది. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి చేపట్టిన పెన్షన్ల పంపిణీ గురువారం నాటికి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 75.25 శాతం, శుక్రవారం నాటికి 94.47 శాతం మందికి పంపిణీ జరిగింది. మిగిలిన వారికి శనివారం రాత్రి 7 గంటలలోపు చెల్లించనున్నారు. మరోవైపు మంచాన పడిన వారికి, దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది నేరుగా వారి ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు.

1,19,849 మందికి పంపిణీ

శ్రమించిన సచివాలయ ఉద్యోగులు



పక్షవాతంతో బాధపడుతున్న రామారావుకు ఇంటి వద్దే పెంఛన్ అందిస్తున్న కార్యదర్శి

సాక్షి,పాడేరు: వలంటీర్ల వ్యవస్థ లేకపోవడంతో గ్రామసచివాలయాల ఉద్యోగులంతా గత మూడు రోజుల నుంచి సామాజిక పింఛన్ల పంపిణీకి ఎంతో శ్రమించారు. గ్రామసచివాలయాలు,అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద వృద్ధులు, వితంతువులు, వివిధ వర్గాల పింఛనుదారులకు నగదు పంపిణీ చేశారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, పక్షవాతంరోగులు, కిడ్నీ బాధితులకు శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి పింఛను అందజేశారు.జిల్లాలోని 22 మండలాల్లో శుక్రవారం రాత్రి నాటికి 1,19,849 మందికి పంపిణీ చేశారు.

అభినందించిన కలెక్టర్

జిల్లాలో పింఛన్ల పంపిణీని విజయవంతంగా నిర్వహించిన అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులను కలెక్టర్ ఎం.విజయసునీత అభినందిస్తూ శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల పంపిణీలో గురువారం రాష్ట్రంలో 26వ స్థానంలో ఉండగా శుక్రవారం 4వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జులైన జాయింట్ కలెక్టర్ భావన, ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, సబ్‌కలెక్టర్లు ధాత్రిరెడ్డి, ప్రశాంత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళి, 22 మండలాల ఎంపీడీవోలు,సచివాలయాల ఉద్యోగులకు ఆమె అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన వారికి పంపిణీ చేయాలని ఆమె కోరారు.

పాడేరులో టీడీపీ ఎదురీత

పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్‌నాయుడు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. సొంత పార్టీతో పాటు కూటమి నేతల నుంచి సహకారం కరువైంది. సమన్వయ సమావేశాలకు ఆయా పార్టీల నేతలు హాజరుకాకపోవడం ఆయనకు మింగుడు పడటం లేదు. గ్రూపు రాజకీయాల మధ్య ఆయన ఒంటరి పోరాటం సాగిస్తున్నారు.

- ఆ పార్టీ అభ్యర్థి వెంకట రమేష్‌నాయుడుకు సహకరించని సొంత పార్టీ శ్రేణులు
- ప్రచారానికి దూరంగా ఉంటున్న జనసేన, బీజేపీ నేతలు
- సమన్వయ సమావేశాలకు హాజరు కాని కూటమి నేతలు

పాడేరు : పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు పరిస్థితి ముందు గొయ్యి.. వెనుక నుయ్యి అన్నచందంగా ఉంది. ఈయనకు కూటమి నేతల నుంచి సహకారం కరువైంది. ఎన్నికల ప్రచారంలో ఎవ్వరూ పాల్గొనడం లేదు. టీడీపీలో సీనియర్లను పక్కనబెట్టిన అధిష్టానం అనూహ్యంగా కొత్తగా పార్టీలోకి వచ్చిన వెంకట రమేష్‌నాయుడు పేరును ప్రకటించింది. దీంతో ఆ పార్టీ శ్రేణులు గ్రూపులుగా విడిపోయాయి. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, ఎంవీఎస్ ప్రసాద్, కొట్టగుళ్లి సుబ్బారావు, వంజంగి కాంతమ్మ, బొర్రా నాగరాజు తదితరులు టీడీపీ అధిష్టాన నిర్ణయాన్ని బహిరంగంగానే వ్యతిరేకించారు. వారి అనుచరులంతా పార్టీ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తూ జెండాలు, ఫ్లెక్సీలు తగులబెట్టి నిరసన తెలిపారు. వెంకట రమేష్‌నాయుడుకు సహకరించేది లేదని హెచ్చరించారు. అయినప్పటికీ పార్టీ అధిష్టానం నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో అప్పటినుంచి వారు పార్టీ కార్యక్రమాల్లో దూరంగా ఉండటం వెంకట రమేష్‌నాయుడుకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో ఆయన ఈనెల 3న తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి టీడీపీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలు హాజరు కాలేదు. అదేరోజు జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశానికి జనసేన ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య మినహా ఎవ్వరూ హాజరు కాలేదు. అదేరోజు ముహూర్తం చూసుకుని తుంపాడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూడా టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్యనేతలెవ్వరూ పాల్గొనలేదు. శుక్రవారం విశాఖలోని ఓ హోటల్‌లో అరకు ఎంపీ (కూటమి) అభ్యర్థి కొత్తపల్లి గీత ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశానికి టీడీపీ నేత బొర్రా నాగరాజు, బీజేపీ నేత కురుసా ఉమామహేశ్వరరావు మినహా ఎవ్వరూ రాలేదు. ఇలా వెంకట రమేష్‌నాయుడుకు బీజేపీ, టీడీపీ, జనసేన శ్రేణుల నుంచి సహకారం లేకపోవడంతో ఆయన నైరాశ్యంలో కూరుకుపోయారు.

వంద శాతం పోలింగ్ లక్ష్యం



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న పీవో అభిషేక్

అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్

అరకులోయ రూరల్: సార్వత్రిక ఎన్నికలలో వందశాతం పోలింగ్ లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పాడేరు ఐటీడీఏ పీవో, అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆదేశించారు. ,ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించాలన్న 48 గంటలు ముందుగానే ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు పొందాలని సూచించారు. ప్రకటించిన తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున డిప్యుటేషన్లు రద్దు అయ్యాయని, మాతృస్థానంలోనే పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, నోడల్ అధికారి సువర్ణ ఫణి పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దాం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



పార్టీ శ్రేణులతో హైమావతి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే పాల్గుణ, ఎమ్మెల్సీ రవిబాబు, అభ్యర్థులు తనూజరాణి, మత్స్యలింగం

అరకులోయ రూరల్: అందరం కలసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని భారీ మెజారిటీతో గెలిపిద్దామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, అరకు అసెంబ్లీ పరిశీలకురాలు హైమావతి, ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అసెంబ్లీ అభ్యర్థి మత్స్యలింగం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు, ముఖ్య నేతలు శుక్రవారం అరకులోయ కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ అందరూ ఏకమై అరకు ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఉషారాణి,ఈశ్వరి,జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు రామన్న, ఆనంద్, లలిత, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్,జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, మహిళా విభాగం జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, నాయకులు శెట్టి అప్పాలు, అశోక్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం

అరకులోయ టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పెదలబుడు పంచాయతీ గంజాయిగుడ గ్రామంలో పర్యటించారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మాత్రం సంక్షేమ పథకాలు, పింఛన్లు ఇంటివద్దకు అందుతాయన్నారు. వలంటీర్ వ్యవస్థను కూడా కొనసాగిస్తారన్నారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఫ్యాన్ ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. తనతోపాటు అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణికి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్థానికులు బోయి మోహన్‌రావు, కొర్రా భీమన్న మాట్లాడుతూ తామంతా గతంలో టీడీపీకి ఓటు వేశామన్నారు. అరకు అసెంబ్లీ టికెట్ బీజేపీకి కేటాయించడం వల్ల ఈ ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలబడి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతలు భారీగా చేరిక

టీడీపీకి కంచుకోటగా ఉన్న పెదలబుడు పంచాయతీ గంజాయిగుడలో అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం సమక్షంలో టీడీపీకి చెందిన 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం జోహార్ వైఎస్సార్ అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సమర్థి శత్రుఘ్న, దురియా ఆనంద్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కొయి లవణ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ పి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గసభ పంచాయతీలో టీడీపీ నేతల చేరిక

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): మండలంలోని గసబ పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీకి చెందిన వంతాల కొండ, నా పార్టీ ముఖ్య నేతలు వంతాల గోపి. బి.అప్పలస్వామి, కె.సిబో. తులసి, గోవర్దన్‌తోపాటు 30 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ జటారి జానకమ్మ, ఎంపీపీ బాక ఈశ్వరి, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, పి. లలిత, ఎంపీటిసి వి. జమ్మి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు హరి, సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, రామూర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలను ఆహ్వానిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

క్లుప్తంగా

'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష వాయిదా

రాజవొమ్మంగి : ఏకలవ్య పాఠశాలల్లో ఆరవ తరగతి ప్రవేశానికి ఈ నెల 13వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్ష ఈనెల 20వ తేదీ శనివారానికి వాయిదా పడిందని స్థానిక ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీ కృష్ణారావు తెలిపారు. 7, 8, 9వ తరగతుల్లోని బ్యాక్ లాగ్ సీట్లకు కూడా ప్రవేశపరీక్షలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

అక్రమంగా బియ్యం తరలింపు

- డీలర్ సస్పెండ్

గొలుగొండ: లింగంపేట రేషన్ డిపో నుంచి అక్రమంగా 750 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా గురువారం రాత్రి గ్రామస్తులు అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 6ఏ కేసు నమోదు చేసి, డీలర్‌ను సస్పెండ్ చేసినట్టు తహసీల్దార్ ప్రభాకర్‌రాజు తెలిపారు.

ఏపీఎస్పీ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

గొలుగొండ: కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన ఒక మహిళను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ అడ్డబోయిన బాలరాజుపై కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డబోయిన బాలరాజు సొంత గ్రామం కృష్ణదేవీపేట. విశాఖ పరిధిలో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బాలరాజు కృష్ణదేవి పేటకు చెందిన ఒక మహిళను మూడు సంవత్సరాల నుంచి ప్రేమిస్తూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బాలరాజు మోసం చేయడంతో కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. బాలరాజు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. ఆమె ప్రస్తుతం నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గతంలో కూడా బాలరాజు లైంగిక వేధింపుల కారణంగా ఇద్దరు మహిళలు ఇబ్బందులు పడినట్టుగా ఆరోపణలు వచ్చాయని ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


జంగాలతోటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసి, మరింత అభివృద్ధిని సాధించి, మరిన్ని సంక్షేమ పథకాలు పొందుదామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని జంగాలతోట, బురదకోట, నెల్లికోట, దద్దిలికివాడ, రాములకొండ, శింగవరం,బండిగడ్డ, దబ్బుమామిడి, కణతలబంద, మునగలపూడి, అమ్మపేట, బూరుగుపాలెం. అన్నంపాలెం, పులుసుమామిడి, దాలిపాడు, తునికలపాడు గ్రామాల్లో ఆమె శుక్రవారంఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు ముఖ్యమంత్రి జగనన్న ఆశిస్సులతో, ఎమ్మెల్సీ అనంత బాబు సారధ్యంలో ఎన్నికల ప్రచార ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబు భూటకపు హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. చంద్రబాబుది ధనికులకు అనుకూలమైన ప్రభుత్వమని, జగనన్నది పేదప్రజల ప్రభుత్వమని అన్నారు. చంద్రబాబు గతంలో ఎన్నికల హామీలు ఇచ్చి, ప్రజలను మోసగించారని ఆయన మోసాలను ఎండగట్టారు. చంద్రబాబు ప్రభుత్వంలో పించన్ మంజూరు చేయాలంటే నాయకులకు, అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చేదని, పింఛన్ వచ్చినా కూడా కొంతసొమ్ము లబ్ధిదారులకు ఇచ్చి, సగం సొమ్మును కాజేసేవారని ఆరోపించారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం సచివాలయ, గ్రామవలంటీరు వ్యవస్థద్వారా నేరుగా ఇంటింటికీ వెళ్ళి, లబ్ధిదారునుకు అందజేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో లబ్ధిదారుని పేరున మంజూరైన సంక్షేమ పథకాలను నేతలు ఎక్కువశాతం కాజేసేవారన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుని ఖాతాకే సొమ్మును జమచేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో మండలానికి లబ్ధిచేకూర్చిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలతో వలంటీర్లకు విధుల నుంచి తొలగించడంతో సచివాలయానికి వెళ్లి పింఛన్లు తీసుకోవడానికి దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదప్రజలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగులపల్లి ధనలక్ష్మిను, అరుకు ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ గుమ్మ తనూజరాణీలను తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, నాయకులు త్రిమూర్తులు, నారాయణరావు, విజయ్‌కుమార్, భారతిబాబు, బాబి, రమేష్, కనకరాజు, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బండారుకు ఇస్తే తడాఖా చూపిస్తా..

- మాడుగులలో పోటీ చేయాలని బండారుకు చంద్రబాబు ఫోన్
- విషయం తెలుసుకొని మండిపడిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్
- బండారు కంటే ముందే మా కుటుంబం రాజకీయాల్లో ఉందన్న పీలా



సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతున్నా.. కూటమిలో టికెట్ల పంచాయితీ నివురు గప్పిన నిప్పులా రాజుతూనే ఉంది. పొత్తుల ఎత్తులతో జిత్తులమారిలా వ్యవహరిస్తున్న చంద్రబాబు సీనియర్ల సీటుకు ఎసరు పెట్టేశారు. పెందుర్తిలో బండారుకు, అనకాపల్లిలో పీలాకు వెన్నుపోటు పొడిచిన బాబు.. ఇప్పుడు మందు రాసేందుకు చేస్తున్న ప్రయత్నాలు మరింత తలనొప్పిగా మారుతున్నాయి. మాడుగుల సీటును బండారుకు ఇద్దామన్న సంకేతాలు వినిపిస్తుండటంతో మరో సీనియర్ పీలా మండిపడుతున్నారు. తనని కాదని బండారుకు సీటెలా ఇస్తారో చూస్తానంటూ అధిష్టానానికి సవాల్ విసురుతున్నారు.

మాడుగులలో బండారు పోటీపై సర్వే

పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేన అభ్యర్థి పంచకర్లకు కట్టబెట్టడంతో బండారు సత్యనారాయణ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. బయటకు టీడీపీతోనే పయనమని చెబుతున్నా.. పంచకర్లకు సహకరించకుండా తటస్థంగా ఉండిపోతారన్న వార్తలు వస్తుండటంతో.. సర్దుబాటు చేసే ప్రయత్నాల్ని చంద్రబాబు ప్రారంభించారు. మరోవైపు అనకాపల్లి సీటును కూడా జనసేనకు త్యాగం చేయడంతో అక్కడ మాజీ ఎమ్మెల్యే పీలా వర్గం రగిలిపోతోంది. పీలాని పిలిచి.. బుజ్జగించి.. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో అసంతృప్తులకు చెప్పిన ఎమ్మెల్సీ మంత్రాన్ని జపించడంతో.. బాబు మాటలు నమ్మి స్తబ్ధుగా ఉందామని పీలా భావించారు. కానీ.. ఇంతలోనే మరో వార్త పీలా వర్గానికి మింగుడు పడకుండా చేస్తోంది. సీట్ల మార్పులో భాగంగా.. మాడుగుల టికెట్‌ని బండారుకు ఇస్తే ఎలా ఉంటుందన్న సర్వేలు, జిల్లా టీడీపీ నేతల అభిప్రాయాల్ని అధిష్టానం సేకరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. మాడుగులలో పోటీ చేయాలని బండారుకు చంద్రబాబు నుంచి ఫోన్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆ నోటా ఈ నోటా నానుతూ పీలా గోవింద్ సత్యనారాయణ చెవిలో పడటంతో సీన్ రివర్స్ అవుతోంది.

మా కుటుంబమే రాజకీయాల్లో ముందు

చంద్రబాబు వైఖరిపై పీలా గోవింద్ మండిపడుతున్నారు. సీటు ఇవ్వకుండా మోసం చేయడం ఒక ఎత్తయితే.. తన జిల్లాలో తనకు కాకుండా ఇంకొకరికి సీటు ఎలా ఇస్తారంటూ అధిష్టానం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లిలో సీటు ఆశించి భంగపడ్డ తనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా బండారుకు ఎలా ఇస్తారంటూ చంద్రబాబుని పీలా ప్రశ్నిస్తున్నారు. అసలు రాజకీయాలు బండారు ఇంట్లో ముందు పుట్టాయా..? మా ఇంట్లో ముందు పుట్టాయా అంటూ టీడీపీ శ్రేణుల వద్ద పీలా ఆక్రోశం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. బండారు నుంచి వారి కుటుంబంలో రాజకీయాలు మొదలయ్యాయి.. మా తాతల కాలం నుంచి మా ఇంట్లో రాజకీయాలు ఉన్నాయి. అలాంటప్పుడు తనని కాదని వేరే వాళ్లకు టికెట్ ఇస్తే సహించేది లేదని.. అధిష్టానానికి పీలా తెగేసిచెప్పినట్లు తెలుస్తోంది. ఒకవేళ టికెట్ బండారుకే ఇస్తే ఎలా గెలుస్తారో తాను చూస్తానని పీలా సవాల్ విసిరినట్లు సమాచారం. ఇప్పటికే అనకాపల్లి టికెట్ ఇవ్వకపోవడంతో అయోమయంలో ఉన్న పీలా వర్గం.. ఇప్పుడు మరో వెన్నుపోటుతో చంద్రబాబు వైఖరిపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.


పోర్టులో ఘనంగా జాతీయ మారిటైం వేడుకలు


గౌరవ వందాన్ని స్వీకరిస్తున్న చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి

విశాఖ సిటీ : విశాఖ పోర్టు అథారిటీలో జాతీయ మారీటైం దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ కన్జర్వేటర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోర్టులో విశేష సేవలందించి అశువులు బాసిన సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం పోర్టు ఫ్లీట్ ఆఫ్ టగ్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వృద్ధిలో సముద్రయాన రంగం కీలక భూమిక పోషిస్తోందన్నారు. మేజర్ పోర్టులలో అత్యధికంగా సరుకు రవాణా చేస్తూ విశాఖ పోర్టు సముద్రయాన రంగంలో తనదైన పాత్రను పోషిస్తోందని తెలిపారు. మారీటైం దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ డీఐజీ రాజేష్ మిట్టల్, హెచ్‌ఐఎంటీ దుర్గా ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

సచివాలయ కార్యదర్శులకు వేధింపులు


గుడాల జగన్నాథరావు

గోపాలపట్నం: సచివాలయం అధికారులను బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్న రౌడీషీటర్ గుడాల జగన్నాథరావును గోపాలపట్నం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం పరిధిలో భవన నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేసి ఇవ్వాలని నిత్యం వేధిస్తున్నట్లు పలు సచివాలయాల కార్యదర్శులు కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీపీ రవిశంకర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. అనంతరం సీపీని కార్యదర్శులు కలిసి ఫిర్యాదు అందించారు. ఆ ఫిర్యాదును ఆయన పెందుర్తి, గోపాలపట్నం పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. విచారణ ప్రారంభించిన గోపాలపట్నం పోలీసులు.. అన్ని ఆధారాలు ఉండటంతో జగన్నాథరావును అరెస్ట్ చేశారు. అతని వల్ల ఎవరైనా ఇబ్బందులు పడి ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సీఐ సురేష్ కోరారు.

నేటితో ముగియనున్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు గడువు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుల రెండేళ్ల పదవీ కాలం శనివారంతో ముగియనుంది. 2022 ఏప్రిల్ 7న ప్రస్తుత ట్రస్ట్ బోర్డు ఏర్పాటైంది. దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు చైర్మన్‌గా, మరో 14 మంది సభ్యులతో కూడిన ట్రస్ట్ బోర్డుని ఏర్పాటు చేస్తూ 2022 ఏప్రిల్ 6న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో నలుగురిని ప్రత్యేక ఆహ్వానితులను కూడా నియమించింది. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 ఫిబ్రవరి 20న దేవస్థానంలో మళ్లీ ట్రస్ట్ బోర్డుని ఏర్పాటు చేశారు. తరువాత 2022 ఏప్రిల్ 6న రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కొత్త ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ బోర్డు పదవీ కాలం ముగియనుంది. కాగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన రెండు ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకాల్లో 50 శాతం మహిళలకు కేటాయించారు.

స్ఫూర్తి ప్రదాత జగ్జీవన్‌రామ్

- కలెక్టర్ విజయ సునీత
- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి


బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ విజయ సునీత, అధికారులు

సాక్షి,పాడేరు: స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తన పరిపాలన దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలందించారని కలెక్టర్ విజయ సునీత పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతోపాటు పలువురు అధికారులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు.30ఏళ్ల పాటు రాజకీయంగా వివిధ హోదాల్లో పనిచేశారన్నారు. దేశానికి అమూల్యమైన సేవలు అందించారని, హరిత విప్లవం విజయవంతం చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.పద్మావతి, సాంఘిక సంక్షేమశాఖ ఉమ్మడి విశాఖ అధికారి జనార్దనరావు, ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ అరుణకుమారి పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు


వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

చింతపల్లి రూరల్: రాష్ట్ర భవిష్యత్తుకోసం రాబోయే ఎన్నికల్లో జగనన్నను గెలిపించాల్సిన అవసరం ఉందని పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో అంజలి శనివారం పంచాయతీ పరిధిలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న కుడిసింగి, తామరపల్లి, అంజలం, వంట్లమామిడి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాడేరు నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్ రాజు సమక్షంలో ఆయాగ్రామాలకు చెందిన కాంగ్రెస్ నేతలు, సుమారు 121 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు వేసి విశ్వేశ్వరరాజు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనకు వస్తున్న ప్రజాదరణను చూసి టీడీపీ, జనసేన పార్టీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, సర్పంచ్ పేట్ల రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షులు మోరిరవి, కోఆప్షన్ నజీర్ వలీ పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాలమ్మ ఉత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన నూకాలమ్మ అమ్మవారి ఆలయం


నూకాలమ్మ అమ్మవారి విగ్రహం

రాజవొమ్మంగి: కోరిన కోర్కెలు ఈడేర్చే చల్లని తల్లిగా రాజవొమ్మంగి శ్రీనూకాలమ్మ అమ్మవారు దాదాపు 150 ఏళ్ళగా పూజలందుకొంటున్నారు. పిల్లల్లో మచూచి, పొంగు, తట్టు వంటి వ్యాధులు, పెద్దల్లో కలరా వంటి మహమ్మారి పొడచూపకుండా ఈ తల్లి నిత్యం మమ్మల్నీ కాపాడుతుందని చెబుతారు. అమ్మవారిని కొలిస్తే పాడిపంటలకు కొదవ లేకుండా ఉంటుదని రైతులు భావిస్తారు.

ఆలయ ప్రాశస్త్యం

ఈ అమ్మవారి గుడి తలుపులు ఏడాదికి ఒకసారి మాత్రమే తెరుచుకోవడం ఇక్కడి విశేషం. రెండు రోజుల పాటు భక్తులకు దర్శనం కల్పించి ఆ తరువాత వంశపారంపర్యంగా వస్తున్న పూజారులు (ఆసాదులు) తిరిగి గుడి తలుపులు మూసేస్తారు. ఏడాదికి ఒకసారి జరిగే అమ్మవారి పండుగకు స్థానికులతో పాటు భద్రాచలం, నర్సీపట్నం, రంపచోడవరం, ఏలేశ్వరం వంటి ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. మొక్కులు తీర్చుకొంటారు. అమ్మవారిని వస్త్రాలు, పూసలు సమర్పించడం మహిళలకు ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ఈనెల 6, 7, 8 తేదీలలో జాగారాలు జరుగుతాయి. ఇప్పటికే దాదాపు 15 రోజులుగా గరగనృత్యాలు జరుగుతుండగా మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్ల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పిల్లల వినోదం కోసం టాయ్ ట్రైయిన్స్, జెయింట్ వీల్ వంటి ఏర్పాట్లు జరిగాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. అమ్మవారి పురాతన కాలంనాటి చిన్న గుడిని తొలగించి ఆ స్థానంలో ఇటీవలే అతి పెద్ద ఆలయాన్ని నిర్మించారు. భారీ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

గురందొరపాలెంను జల్లెడ పట్టిన పోలీసులు

- ఇళ్లల్లో సోదాలు
- పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చిన డీఎస్పీ మోహన్


డాగ్ స్క్వాడ్‌తో గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నర్సీపట్నం: మండలంలోని గురందొరపాలెంలో పోలీసులు కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. శుక్రవారం ఉదయం వందలాదిగా పోలీసులు గ్రామంలోకి ప్రవేశించడంతో ఏం జరిగిందోనని గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. బయట వ్యక్తులను గ్రామంలోకి అనుమతించలేదు. అదేవిధంగా గ్రామస్తులను బయటకు వెళ్లనీయలేదు. ఈ గ్రామంలో గంజాయి, సారా కేసుల్లో ఉన్న వారి ఇళ్లను క్షుణ్ణంగా సోదాలు చేశారు. రికార్డులు పరిశీలించి, లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. సారా తయారీకి వినియోగించే పాత్రలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా కార్డన్ సెర్చ్ కార్యక్రమం చేపట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో గ్రామాన్ని జల్లెడ పట్టినట్టు చెప్పారు. ఈ తనిఖీల్లో మొత్తం 120 మంది సివిల్, రైల్వే పోలీసులు పాల్గొన్నారని, డాగ్‌స్క్వాడ్‌ను వినియోగించామని డీఎస్పీ తెలిపారు.

రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా స్టేషన్ల మధ్య స్పెషల్ రైళ్లు (వయా దువ్వాడ మీదుగా) నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి తెలిపారు.

- ఎర్నాకుళం–బ్రహ్మపూర్(06087) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈనెల 6,13,20,27, మే 4,11,18,25వ తేదీల్లో (శనివారాలలో) రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–ఎర్నాకుళం(06088) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈనెల 8,15,22,29, మే 6,13,20,27వ తేదీల్లో (సోమవారాలలో) మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.
- చెన్నై ఎగ్మోర్ –సంత్రగచ్చి (06077) స్పెషల్ రైలు చెన్నై ఎగ్మోర్‌లో ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18, 25వ తేదీలలో (శనివారాలలో) రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు (సోమవారాలలో) ఉదయం 7.15 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సంత్రగచ్చి– చెన్నై ఎగ్మోర్ (06078)స్పెషల్ సంత్రగచ్చిలో (ప్రతీ సోమవారాలలో) ఈనెల 15,22,29, మే 6,13,20,27వ తేదీల్లో ఉదయం 10గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.48 గంటలకు దువ్వాడకు అదేరోజు మధ్యాహ్నం 3.30గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.
- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(06073) స్పెషల్ మే 6,13,20,27, జూన్ 3వ తేదీలలో(సోమవారాలలో) రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15గంటలకు దువ్వాడకు అదేరోజు సాయంత్రం 6.30గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–చెన్నై సెంట్రల్(06074) భువనేశ్వర్‌లో మే 7,14,21,28 జూన్ 4వ తేదీలలో(మంగళవారాలలో) రాత్రి 9గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.42గంటలకు దువ్వాడకు మధ్యాహ్నం 3గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.